క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందిస్తున్న గ్రంథాలయాధికారి సూర్యకళ

పెందుర్తి: దసరా సెలవుల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన కథా, బుక్ రివ్యూ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి శనివారం బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ చేతుల మీదుగా రైటింగ్ ప్యాడ్‌లు, టిఫిన్ బాక్స్‌లు పంపిణీ చేశారు. విద్యార్థి దశ నుంచే పలు సామాజిక అంశాలపై ఆసక్తి పెంచుకోవాలని ఆమె సూచించారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



పులగాలిపాలెంలో బీపీ చెక్ చేయించుకుంటున్న మెంటి మహేష్

పెందుర్తి: ప్రజల ఆరోగ్య భద్రత ప్రభుత్వ లక్ష్యమని 97వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ అన్నారు. వార్డు పరిధిలోని పులగాలిపాలెంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉచితంగా వైద్యం పొందే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రజలంతా ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 215 మందికి వైద్య సిబ్బంది ఓపీ ద్వారా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందించేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు.

పార్టీ నాయకులు కిల్లి అప్పారావు, నరవ బంగారునాయుడు, హేమంత్, కిల్లి దేముడు, రాజు, నరేష్, వాసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాగ్నిటివ్ డిజిటల్ థెరపీ కేంద్రం ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన అధునాతన కాగ్నిటివ్ డిజిటల్ థెరపీ కేంద్రాన్ని శనివారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రారంభించారు. అనంతరం కేంద్రం పని తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్రం ప్రత్యేకతలు, ప్రజలు, విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. తరువాత విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విశ్రాంతి గదిని విద్యార్థినితో వీసీ ప్రారంభింపజేశారు. అలాగే విభాగంలో ప్రయోగశాలలను తనిఖీ చేశారు. విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ వ్యక్తిలో మానసిక సమస్యను గుర్తించడం, డిప్రెషన్, ఒత్తిడి స్థాయిలు, ఏంగ్జయిటీ, ఎమోషన్స్ వంటివి కాగ్నిటివ్ డిజిటల్ థెరఫీ సహాయంతో గుర్తించడం సాధ్యపడుతుందన్నారు. ఆత్మహత్యల నివారణకు ఇది ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఆల్కహాల్ ఎవర్షన్ థెరపి(మద్యం మాన్పించే విధానం), న్యూరో ఫిజియాలజికల్ లాబ్‌కు పని చేస్తున్న విధానాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీ పాహిమాం

విభిన్న అలంకరణల్లో దర్శనమిచ్చిన దుర్గమ్మ



పంచముఖ గాయత్రీ ఆలయంలో మహాలక్ష్మిగా..



మహాకామేశ్వరీ పీఠంలో అమ్మవారికి పట్టుచీరలు సమర్పించి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లో అమ్మవారు ధనలక్ష్మిగా, దుర్గమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు.

ధనలక్ష్మిగా అలివేలు మంగమ్మ

చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో కొలువుదీరిన అలివేలు మంగమ్మ ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అన్ని రకాల కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణిబాబు ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిపారు.

దుర్గాదేవిగా కనకమహాలక్ష్మి

సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కనకమహాలక్ష్మి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ధనలక్ష్మిగా గాయత్రీమాత

చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో కొలువైన పంచముఖ గాయత్రీ అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. కుంకుమ పూజలు జరిపారు. కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. 24 అమ్మవార్ల అవతారాలతో నృత్య కళాకారులు ప్రదర్శన చేశారు.

మహాకామేశ్వరీ పీఠంలో సుహాసిని అర్చన

సాధుమఠం సమీపంలోని మహాకామేశ్వరీ పీఠంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుహాసిని అర్చన ఘనంగా జరిపారు. అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు చేశారు. శాస్త్రీయ నృత్య ప్రదర్శన అత్యంత శోభాయనంగా జరిగింది. పీఠం నిర్వాహకులు ప్రసాద వితరణ చేపట్టారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

పరవాడ: శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దుర్గమ్మ రోజుకో అవతారంలో పూజలందుకుంటున్నారు. కుంకుమార్చలు, దీపారాధనలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరవాడలోని బొంకులదిబ్బ వద్ద బొంకుల దిబ్బయూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గమాంబను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దుర్గా మాతను దర్శించుకున్న వారిలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, చైర్మన్ చల్లా కనకారావు, వెన్నలపాలెం సర్పంచ్ వి.అప్పారావు, రెడ్డి శ్రీనివాసరావు, పైల అప్పలనాయుడు ఉన్నారు.



విజినిగిరిపాలెంలో మహాలక్ష్మి అలంకరణలో..



దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

మహాలక్ష్మిగా ఉమాదేవి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉమాదేవి మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



సుజాతనగర్‌లో దుర్గాదేవిగా..



ధనలక్ష్మి అవతారంలో అలివేలు మంగమ్మ



పంచముఖ గాయత్రీ ఆలయంలో 24 అమ్మవార్ల అవతారంలో నృత్య కళాకారుల ప్రదర్శన

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



నరవలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, చిత్రంలో నాయకులు

పెందుర్తి: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. జీవీఎంసీ 88వ వార్డు పెద నరవ, కోట నరవ, సతివానిపాలెం రోడ్డు పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.70 కోట్లతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా మారిందన్నారు. కరోనాతో పాటు ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొడుతూ ప్రజలకు అన్ని విధాల అండగా ఉంటున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రజారంజక పాలనను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక విషం చిమ్ముతున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాల కుట్రలను గమనించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ ప్రసాద్‌బాబు, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, పార్టీ నాయకులు దాడి నూకరాజు, మళ్ల రమణ, మళ్ల నూకఅప్పారావు, చిడగం అప్పలరాజు, ఎదురు సూరిబాబు, ఆళ్ల శ్రీను, శరగడం సతీష్, దొడ్డి రమేష్, జి.అప్పలరాజు, పైల నూకరాజు, దొడ్డి సాయి పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. చింతలగ్రహారం గవరపాలెం సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద చేపట్టిన డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించడంతో పాటు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కాళ్ల గంగాధర్, దాడి అర్జున్, పులమరశెట్టి లక్ష్మణ్, కాళ్ల సురేష్, పెంటకోట శంకర్, బొడ్డేటి జగదీష్ పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



గరుడసేవలో..

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

• శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని అదిష్టింపజేశారు. అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఉక్కిరిబిక్కిరి



రాంకీ కూడలిలో ఎగసిపడుతున్న దుమ్ము

పరవాడ: లంకెలపాలెం-పరవాడ రహదారిలో ఎగసిపడుతున్న ధూళితో ప్రయాణికులు, పరిసర ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల నుంచి బూడిద, బొగ్గు తరలించే వందలాది వాహనాలు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే బూడిద తరలిస్తున్న లారీలు నిబంధనలు పాటించక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో బొగ్గు రోడ్డుపై పడి వాహనాలతో రాకపోకలతో ధూళి రాంకీ కూడలిని కమ్మేస్తుంది. రోడ్లపై ఎగసిపడుతున్న ధూళి కారణంగా ప్రయాణికులు గొంతు, ముక్కు, కళ్ల సమస్యలతో సతమతమవుతున్నారు. ధూళి కారణంగా రోడ్ల పక్కన వ్యాపారాలు సన్నగిల్లుతున్నాయని చిరువ్యాపారులు వాపోతున్నారు.

వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య

భారీ వాహనాల రాకపోకలకు అనుగుణంగా రహదారిని విస్తరించక పోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఎదురెదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు ఈ మార్గంలోని పలు ప్రాంతాల్లో తప్పించుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఎగసిపడుతున్న ధూళితో పెదముషిడివాడ కూడలి, లంకెలపాలెం కూడలి, రాంకీ కూడలి, సింహాద్రి కూడలి, మండల కాంప్లెక్సు కూడలి, సబ్‌స్టేషన్ , సినిమాహాలు, ఊటగెడ్డ కూడళ్లు ధూళి మయమవుతున్నాయి. ప్రధాన కూడళ్లలో ధూళిని అరికట్టడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

982వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



982వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోనే పెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 982వ రోజు, శనివారం ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమర వీరుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. నిరంతరాయంగా పోరాటాన్ని కొనసాగించడం ద్వారా కేంద్రప్రభుత్వంపై ప్రతిఘటన మరింత పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కార్మికులు తలచుకుంటే ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వదిలి కార్మికులకు అండగా నిలబడాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

జూలో సందడి

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో దసరా సందడి నెలకొంది. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో జూకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. రెండు రోజులుగా పిల్లలను తీసుకొని ఎక్కువ మంది తల్లిదండ్రులు జూని సందర్శిస్తున్నారు. ఎక్కువగా కోతులు, ఏనుగులు, పులులు, నీటి ఏనుగుల ఎన్‌క్లోజర్లు, పక్షులు, పాముల జోన్‌ల వద్ద పిల్లలు ఎక్కువగా సందడి చేస్తున్నారు. ఇక్కడ వన్యప్రాణులను చూడడంతో పాటు మధ్యలో ఉన్న ఆటస్థలాల్లో సరదాగా ఆడుకుని రోజంతా గడుపుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



భీమస్వామి కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని ఇరువాడలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో వివరించారు.అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో అత్యవసరమైన పనులు చేపడుతున్నట్టు చెప్పారు. దశలా వారీగా సమస్యలు పరిష్కస్తున్నామన్నారు.

ఎల్‌పీఎంల అందజేత

గ్రామంలో సమగ్ర రీ సర్వే పూర్తి కావడంతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ రైతులకు ఎల్‌పీఎంలు అందజేశారు.అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఇరువాడకు చెందిన జెట్టి భీమస్వామి మృతి చెందడంతో ఆయన భార్యకు రూ.5 లక్షల వైఎస్సార్ బీమా చెక్కు అందించారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు,స్థానిక నాయకులు బలిరెడ్డి కనకరాజు,బంగారు నాయుడు, ఎంపీడీవో రమేష్ నాయుడు,తహసీల్దార్ సత్యనారాయణ,పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,కాపుశెట్టి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు

సబ్బవరం: రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సచివాలయం-3 పరిధిలోని పెదనాయుడుపాలెం గ్రామస్తులకు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎప్పుడూ లేనివిధంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము,మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు,ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ సత్యనారాయణ,ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయం



ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఐ సురేష్

సబ్బవరం: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు తమ ప్రాణాలను కూడా లెక్క చేయరని ఎస్ఐ ఎల్. సురేష్ అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలను స్మరించుకునేందుకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సబ్బవరం పోలీస్ స్టేషన్ నుంచి మూడు రోడ్ల కూడలి వరకూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 21 నుంచి 31 వరకూ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కెటీఎస్ రావు, సత్యనారాయణ,తాతారావు,నర్సింగరావు,శేషు కుమార్, కృష్ణ,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన



అన్నప్రసాదాలు వడ్డిస్తున్న 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అన్న సమారాధనను కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. దాదాపు 4 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రోమాల నూకరాజు, టి.చిన్నంనాయుడు, సంజీవ్, పెంటారావు, కంచిబోయిన సంతోష్, బొడ్డు దేముడు, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేసు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా సంఘటితంగా కాపాడుకుందామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. ప్రైవేటీకరణను ఉపసంహరించుకునేంత వరకు ఐక్య పోరాటం కొనసాగుతుందన్నారు. బీఎఫ్-3ని జిందాల్ లాంటి ప్రైవేటు వారికి ఇచ్చి నడిపిస్తామంటే ఒప్పుకోబోమన్నారు. కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, మసేనురావు, డి.నర్సింగరావు, నరేష్‌కుమార్, మిత్రా, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.